TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 30 శుక్రవారం, అక్టోబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 170 తెలుగువారి పత్రిక..... మీ కోసం

చంద్రబాబు విజ్ఞప్తికి వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం

- అర్నబ్ తుపానుతో దెబ్బతిన్న ఏపీకి అండగా నిలిచిన తెలంగాణ
- సీఎం చంద్రబాబు విజ్ఞప్తికి రేవంత్ సర్కార్ సానుకూల స్పందన
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు 500 మంది సిబ్బంది తరలింపు
- తుపాను కారణంగా 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు ధ్వంసం
- విపత్కర సమయంలో తెలుగు రాష్ట్రాల మధ్య అరుదైన స్నేహబంధం

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. తుపాను ధాటికి దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సహకారం అందించాలన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి పట్ల రేవంత్ రెడ్డి సర్కారు వెంటనే స్పందించింది. ఈ మేరకు ఏపీకి ప్రత్యేక బృందాలను పంపింది. అర్నబ్ తుపాను ప్రభావంతో అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం సహా పలు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 16,000లకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వందలాది గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఈ నేపథ్యంలో, విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడి సహాయం కోరారు.

మిగతా 2 లో

చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్..

తెలంగాణ సర్కార్‌పై తీవ్ర విమర్శలు!

-కరవు పరిస్థితులను చంద్రబాబు -గొప్పగా నిర్వహించారన్న కేటీఆర్

అక్కడ లేని కరవు తెలంగాణలో -ఎందుకుందని ప్రభుత్వంపై విమర్శ

కొండా సురేఖ ఏం చెప్పారో పూర్తిగా చూడలేదని వెల్లడి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు కురిపించారు. తెలంగాణలో కరవు పరిస్థితులపై స్పందిస్తూ, పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆయన ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ కంటే ఏపీలో ఎక్కువ కరవు ఉన్నప్పటికీ, చంద్రబాబు పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించారని కేటీఆర్ అన్నారు. పక్క రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటకలో లేని కరవు తెలంగాణలోనే ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది '30 శాతం కమీషన్ సర్కార్' అని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని కూడా తెలిపారు.

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం.. తీరం వైపు మరో ముప్పు

-అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు

-దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం

-రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం

-నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు

-కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన

'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది.

మిగతా 2 లో

సారీ.. కేటీఆర్

-నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు

-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ

-గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన

-రేవంత్ రెడ్డి క్యాబినెట్ నుంచి తొలగించిన తర్వాత ఈ పరిణామం

-కొండా దంపతులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలకు బలం

తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పారు. గతంలో ఆయనపై చేసిన వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ పరిణామంతో ఆమె తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అప్పట్లో ప్రతిపక్షంపై చేసిన రాజకీయ విమర్శల్లో భాగంగానే ఆ వ్యాఖ్యలు చేశానని, కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వకంగా కించపరిచే ఉద్దేశం తనకు లేదని సురేఖ తన పోస్టులో స్పష్టం చేశారు.

మిగతా 2 లో

కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుంది:

-నగరి ఛైర్మన్ పీఠాన్ని కుట్రతో ఏకగ్రీవం చేసుకున్నారన్న రోజా

-ఛైర్మన్ ఏకగ్రీవంపై హైకోర్టులో పిటిషన్ వేశామని వెల్లడి

-టీడీపీకి తొత్తుగా మున్సిపల్ కమిషనర్ వ్యవహరించారని ఆరోపణ

కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే వారు కుట్ర రాజకీయాలకు పాల్పడు తున్నా రని మాజీ మంత్రి, వైసీపీ నాయ కురాలు రోజా తీవ్రంగా విమర్శిం చారు. నగరి మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బైక్ ర్యాలీ, ఓపెన్ టాప్ వాహన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా రోజా మాట్లాడుతూ అధికార కూటమిపై విరుచుకు పడ్డారు. "నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే పోటీ చేసి గెలవాలి కానీ, వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారు. నగరి మున్సిపల్ ఛైర్మన్ పదవిని కుట్రపూరితంగా ఏకగ్రీవం చేసు కున్నారు" అని రోజా ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ టీడీపీకి తొత్తుగా వ్యవహరిస్తూ, సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతో ఈ ఏకగ్రీవానికి సహకరించారని ఆమె ఆరోపించారు. స్క్రూటినీలో ఆమోదం పొందిన తమ అభ్యర్థి నామినేషన్‌ను తర్వాత ఎలా తిరస్కరిస్తారని ప్రశ్నించారు.

మిగతా 2 లో

స్టాక్ మార్కెట్లో జియో సంచలనం...

02

ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద టెల్కోగా అవతరణ!

భారత్‌ను తీవ్రంగా దెబ్బకొట్టనున్న ఎల్‌నినో.. మార్చి నాటికి 55 వేల మరణాలు..!

భారతదేశాన్ని ఎల్‌నినో తీవ్రంగా దెబ్బకొట్టనుందా..? ఎల్‌నినో కారణంగా పెరుగుతున్న అసాధారణ ఉష్ణోగ్రతలు రాబోయే నెలల్లో ప్రాణనష్టాన్ని పెంచనున్నాయా..? తాజా పరిశోధన ఆధారిత అంచనాలు ఈ ప్రశ్నలకు ఔననే సమాధానం ఇస్తున్నాయి. అమెరికా లోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ రూపొందించిన న్యూ ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి నాటికి భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణస్థాయికి మించి సుమారుగా 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉన్నది. ఆ మరణాల్లో ఎక్కువ భాగం మార్చి నెలలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని న్యూ ట్రాకర్ అంచనా వేసింది. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఈ అంచనా కచ్చితంగా వెల్లడించడం లేదు. కాగా, ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంవల్ల సంభవించే ఓ పరిణామం.

02

గూగుల్ కొత్త 'ఏఐ'పై సుందర్ పిచాయ్ పోస్టు.. ఎలాన్ మస్క్ స్పందన

-గూగుల్ కొత్త ఏఐ మోడల్ 'జెమిని 4 కార్బన్'పై ఎలాన్ మస్క్ ప్రశంస

-సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ లోపాల పరిష్కారమే లక్ష్యంగా రూపకల్పన

-శక్తివంతమైన టూల్ కావడంతో దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పరిమిత విడుదల

రామ్‌లీలా మైదానానికి తరలిరండి..

విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి

-ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని స్పష్టం

-భయపడకుండా విద్యార్థులు తరలిరావాలని ప్రత్యేక విజ్ఞప్తి

-పోలీసులకు, లాఠీలకు భయపడొద్దని యువతకు ధైర్యం చెప్పిన రాహుల్

కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ దేశ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్'కు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు.. కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి

ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ నుంచి కొండా సురేఖను తొలగించిన కొన్ని రోజులకే ఈ పరిణామం జరగడం గమనార్హం. సరైన వివరణ ఇవ్వకుండా తనను మంత్రి పదవి నుంచి తొలగించడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ మహిళను కావడం వల్లే తనను తప్పించారా అని కూడా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కొండా సురేఖ, ఆమె భర్త మురళి కాంగ్రెస్‌ను వీడి తిరిగి సొంత గూటికి (బీఆర్ఎస్) చేరవచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కేటీఆర్‌తో ఉన్న పాత విభేదాలను పరిష్కరించుకుని, పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవడంలో భాగంగానే ఈ క్షమాపణ చెప్పారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై బీఆర్ఎస్ నాయకత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

మొదటిపేజీ తరువాయి

చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్.. తెలంగాణ సర్కార్‌పై తీవ్ర విమర్శలు!

ఇదే సమయంలో, గతంలో తనపై చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పడంపై కేటీఆర్ స్పందించారు. 'నిజం నిలకడ మీద తేలుతుంది' అని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ ఏం చెప్పారో ఇంకా పూర్తిగా చూడలేదని, ఆ వివరాలు చూశాక లీగల్ టీమ్‌తో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇటీవల ఒక పత్రిక కూడా క్షమాపణ చెప్పిందని గుర్తుచేశారు. మున్ముందు తనపై ఫార్ములా–ఈ రేస్, విద్యుత్ కుంభకోణం వంటి తప్పుడు ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరూ పశ్చాత్తాపంతో క్షమాపణలు చెప్పక తప్పదని ఆయన అన్నారు.కాగా, అంతకుముందు మంత్రి కొండా సురేఖ ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో భాగంగా, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలోనే ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని, కేటీఆర్‌ను వ్యక్తిగతంగా బాధపెట్టే ఉద్దేశం తనకు లేదని ఆమె స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం.. తీరం వైపు మరో ముప్పు

మొదటిపేజీ తరువాయి

ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే 'అర్నబ్' తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుంది: రోజా

మొదటిపేజీ తరువాయి

ఈ ఏకగ్రీవాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశామని, తమకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని రోజా స్పష్టం చేశారు. గత రెండున్నరేళ్లుగా నగరిలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని, వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో సైకిల్‌ను తుక్కు తుక్కుగా ఓడించి, కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.

రామ్‌లీలా మైదానానికి తరలిరండి..

విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ ఆత్మను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమమని, ఓట్ల దొంగతనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితం కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల కమిషన్ వైఖరితో విభేదించే ప్రతి ఒక్కరూ, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే పౌరులందరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. "మీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆలోచనలు, జీవన విధానంపై దాడి జరుగుతోందని మీరు భావిస్తే, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఈ మార్చ్‌కు తరలిరండి. పోలీసులకు, లాఠీలకు భయపడవద్దు. బీజేపీ ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడే సాహసం చేయదు" అని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని, దీనిని విజయవంతం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్లో జియో సంచలనం...

ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద టెల్కోగా అవతరణ!

- -స్టాక్ మార్కెట్లో అరంగేట్రంతోనే రికార్డు సృష్టించిన సంస్థ
- -రూ. 12.5 లక్షల కోట్ల విలువతో ఆసియాలో రెండో స్థానం
- -దేశంలోనే అతిపెద్ద ఐపీవోగా నిలిచిన జియో ప్లాట్‌ఫామ్స్
- -భారత్‌లో రిలయన్స్ తర్వాత రెండో అత్యంత విలువైన కంపెనీగా గుర్తింపు

రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన తొలిరోజే సంచలనం సృష్టించింది. అక్టోబర్ 28న జరిగిన భారీ లిస్టింగ్ అనంతరం, ప్రపంచంలోనే ఆరో అత్యంత విలువైన లిస్టెడ్ టెలికాం కంపెనీగా అవతరించింది. సుమారు 131 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 12.5 లక్షల కోట్ల) మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ఈ ఘనత సాధించింది. ఆసియాలో చైనా మొబైల్ తర్వాత రెండో అతిపెద్ద టెల్కోగా కూడా జియో నిలిచింది.ప్రపంచ టెలికాం కంపెనీల జాబితాలో చైనా మొబైల్ సుమారు 221 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత వెరిజాన్ (182 బిలియన్ డాలర్లు), టీ–మొబైల్ యూఎస్ (157 బిలియన్ డాలర్లు), ఏటీ అండ్ టీ (141 బిలియన్ డాలర్లు), డాయిష్ టెలికాం (135 బిలియన్ డాలర్లు) వరుసగా ఉన్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఈ జాబితాలో ఆరో స్థానంలో నిలిచి, భారతీ ఎయిర్‌టెల్‌ను వెనక్కి నెట్టింది.దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టించిన జియో ప్లాట్‌ఫామ్స్‌కు ఇన్వెస్టర్ల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. రూ. 1,119 ఇష్యూ ధరకు బదులుగా, లిస్టింగ్ రోజున ఏకంగా రూ. 1,358 వద్ద షేర్లు ట్రేడింగ్ ప్రారంభించాయి. ఇది ఇష్యూ ధర కంటే 21.36 శాతం అధికం. ట్రేడింగ్ ముగిసే సమయానికి షేరు విలువ సుమారు 26–27 శాతం లాభపడింది. ఈ ఐపీవో ద్వారా కంపెనీ రూ. 30,213 కోట్లు సమీకరించగా, 22 రెట్లకు పైగా సబ్‌స్క్రయిబ్ అయింది. ఈ విజయవంతమైన లిస్టింగ్‌తో, జియో ప్లాట్‌ఫామ్స్ భారత్‌లో మాతృసంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత రెండవ అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా నిలిచింది. ఈ పరిణామం రిలయన్స్ గ్రూప్ మొత్తం మార్కెట్ విలువను మరింత పెంచింది.

భారత్‌ను తీవ్రంగా దెబ్బకొట్టనున్న ఎల్‌నినో..

మార్చి నాటికి 55 వేల మరణాలు..!

దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠస్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా వేసింది. న్యూ ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని న్యూ ట్రాకర్ పేర్కొన్నది. అయితే ఈ న్యూ ట్రాకర్ అంచనాలు మరణాలు తప్పనిసరిగా సంభవిస్తాయని చెప్పడంలేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ఈ ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

గూగుల్ కొత్త 'ఏఐ'పై సుందర్ పిచాయ్ పోస్టు..

ఎలాన్ మస్క్ స్పందన

మొదటిపేజీ తరువాయి

టెక్ దిగ్గజం గూగుల్ తన సరికొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఇూ×) మోడల్‌ను ఆవిష్కరించింది. 'జెమిని 4 కార్బన్' పేరుతో విడుదలైన ఈ మోడల్‌కు, అనూహ్యంగా ప్రత్యర్థి సంస్థ అధినేత ఎలాన్ మస్క్ నుంచి ప్రశంసలు లభించడం టెక్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్ వేదికగా జెమిని 4 కార్బన్ గురించి పోస్ట్ చేయగా, దానికి ఎలాన్ మస్క్ 'ఇంప్రెసివ్' (అద్భుతం) అంటూ ఒక్క మాటలో స్పందించారు. దీనికి సుందర్ పిచాయ్ 'నమస్కారం' ఎమోజీతో బదులిచ్చారు. గతంలో గూగుల్ ఆర్థిక ఫలితాలపై కూడా మస్క్ ఇదే విధంగా స్పందించడం గమనార్హం. ఏమిటీ జెమిని 4 కార్బన్?

సైబర్ సెక్యూరిటీ రక్షణ, సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పనుల కోసం జెమిని 4 కార్బన్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు గూగుల్ తెలిపింది. ఇది సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను గుర్తించడం, వాటిని హ్యాకర్లు ఎలా వాడుకోగలరో పరీక్షించడం, ఆ లోపాలను సరిచేసేందుకు పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. అంతర్గత బెంచ్‌మార్క్‌లలో, ఇది తన పాత వెర్షన్ కంటే రెట్టింపు స్థాయిలో సురక్షితమైన కోడ్‌ను రూపొందించిందని కంపెనీ పేర్కొంది. పరిమితంగానే విడుదల ఈ శక్తివంతమైన టూల్ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు గూగుల్ ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. అందుకే తొలుత 'ఫెయిర్‌విండ్ ప్రోగ్రామ్' కింద ఎంపిక చేసిన కొంతమంది సైబర్ సెక్యూరిటీ నిపుణులకు మాత్రమే దీన్ని అందుబాటులోకి తెచ్చింది. భద్రతా ప్రమాణాలను మరింతగా పరీక్షించి, మెరుగుపరిచిన తర్వాతే దీన్ని విస్తృతంగా విడుదల చేయనుంది. రెండు వారాల క్రితమే జెమిని 4 ఆర్గాన్‌ను విడుదల చేసిన గూగుల్, ఇంత తక్కువ సమయంలో మరో కొత్త మోడల్‌ను తీసుకురావడం ఏఐ రంగంలో తీవ్రమైన పోటీని సూచిస్తోంది.

తాడేపల్లిగూడెం పట్టణంలో మూడు పోలింగ్ స్టేషన్లలో మార్పులు

తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ

తాడేపల్లిగూడెం, అక్టోబరు 29 (తెలంగాణ మంజీరా)

తాడేపల్లిగూడెం పురపాలక సంఘ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించామని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు గురువారం తెలిపారు. జాబితాలో మూడు పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మార్పులు చేశామని చెప్పారు. మార్పులు చేసిన కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి. టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 29/1, 29/2 పోలింగ్ కేంద్రాలను ఏపీ ఎస్ఎస్ఎస్ఆర్ పాఠశాలకు మార్చామని తెలిపారు. ఏపీఎస్ఎస్–ఎస్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 31/1, 31/2 పోలింగ్ కేంద్రాలనుసుబ్బారావుపేట ఉన్నత పాఠశాలకు, 3/2 పోలింగ్ కేంద్రాన్ని పదో వార్డు సచివాలయం నుంచి ఈలీ ఆంజనేయులు సంజీవ్‌నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు మార్చామని తెలిపారు. ఈ తుది పోలింగ్ కేంద్రాల జాబితాను పురపాలక సంఘ కార్యాలయంలో ప్రదర్శించినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి. భవానీబాబు, మున్సిపల్ మేనేజర్ పి. ప్రసాదరావు, టౌన్ ప్లానింగ్ అధికారి వి. జగదీశ్వరరావు, స్వర్ణ గ్రామం––స్వర్ణ వార్డు మేనేజర్ ఎం. నాగరాజు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు విజ్ఞప్తికి వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తిపై భట్టి విక్రమార్క వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలను ఏపీకి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. టీజీఎస్పీడీసీఎల్ నేతృత్వంలోని ఈ బృందాలు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరి, కూలిపోయిన స్తంభాలు, తెగిపడిన తీగల మరమ్మతు పనుల్లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఏపీలో 1,700 మంది స్థానిక సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమవ్వగా, మరో 500 మందిని ఇతర డిస్కంల నుంచి రప్పిస్తున్నారు. వీరికి తోడుగా తెలంగాణ సిబ్బంది కూడా చేరడంతో పనులు వేగవంతమయ్యాయి. వీలైనంత త్వరగా, వీలైతే 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా ఇరు రాష్ట్రాల సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తున్నారు.

యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి..!

-అదనపు కలెక్టర్ పాండు -ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో సుమారు 400 మంది యువ కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానందుడు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తిని పెంపొందించేందుకు చేసిన బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వివేకానందుడు 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటులో అమెరికా సోదరీమణులారా, సోదరులారా అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించి

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. యువత తమలోని ప్రతిభను వెలికితీసి, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచిం చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ యువత చదువుతో పాటు కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాల న్నారు. యువజనోత్సవాలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. స్వామి వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, సమాజ సేవతో పాటు దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపు నిచ్చారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గేయం, వీధి నాటకం, తదితర కళాంశాల్లో పోటీలు నిర్వహించారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడ ప్రథమ స్థానం పొందిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అధికారులు తెలిపారు. వచ్చే జనవరిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, అధికారులు, యువ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పశుగ్రాస అభివృద్ధిపై కార్యక్రమం

పశువులకు నాణ్యమైన పచ్చిమేత

పశుపోషకులకు ఆర్థిక ప్రయోజనం

జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

పశువులకు ఏడాది పొడవునా నాణ్యమైన పచ్చిమేత అందుబాటులో ఉంచడంతో పాటు పశుపోషకులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ప్రభుత్వం వ్యక్తిగత పశు గ్రాస అభివృద్ధి కార్యక్రమం అమలు చేస్తోం దని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన రైతులు తమ భూముల్లో పశుగ్రాస పంటలను సాగు చేసుకుని పశువులకు అవసరమైన మేతను సొంతంగా సమకూర్చుకోవచ్చని పేర్కొన్నారు. పశువులకు సమతుల్యమైన పోషకాహారం అందిం చడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచు కునే అవకాశం ఉంటుందని తెలిపారు. పశుగ్రాసాన్ని సొంతంగా సాగు చేసుకోవడం వల్ల బయట నుంచి మేత కొనుగోలు చేయాల్సిన అవసరం తగ్గి, పశుపోషణ ఖర్చులను నియంత్రించు కోవచ్చని వివరించారు. తద్వారా రైతులకు అదనపు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పశుగ్రాస సాగుకు అనువైన భూమి, అవసరమైన నీటి వసతి కలిగిన రైతులు అర్హత ప్రమాణాలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ప్రభుత్వ సబ్సిడీ వివరాల కోసం సమీపంలోని పశువైద్యశాల లేదా సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి కోరారు.

జాతీయ స్థాయి కార్యక్రమానికి తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాలంటీర్ల ఎంపిక..!

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

గుజరాత్‌లోని కెవడియాలో ఈ నెల31న నిర్వహించనున్న రాష్ట్రీయ ఏక్తా దివస్--2026 జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొనేందుకు సంగారెడ్డి జిల్లా నుండి 11 మంది జాతీయ సేవా పథకం వాలంటీర్లు, ఐదుగురు సర్పంచులు ఎంపికయ్యారని, వీరిలో తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డికి చెందిన 11 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉండటం కళాశాలకు, జిల్లాకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం దేశ ఐక్యత, సమగ్రత, జాతీయ సమైక్యతను చాటిచెప్పే ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని ఆమె పేర్కొన్నారు. ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం మరింత పెంపొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన సమన్వయ బాధ్యతలను ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, ఎమ్మార్వో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపిక కావడంపై కళాశాల అధ్యాపక బృందం, కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ అవకాశం యువతకు దేశ ఐక్యత, జాతీయ సమగ్రత పట్ల మరింత అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు.

తప్పని నీటి తిప్పలు..!

-దాహం తీర్చండి మహా ప్రభో..! -మంచి నీటిలో మురుగు నీరు కలుషితం

-పట్టణ వాసుల గోస... ఎవరికి చేప్పాలి బాదా..?

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో రోజు రోజుకు మంచి నీటి సమస్య వేడెక్కుతుంది. పట్టణ వాసులు నీటి దాహం తీర్చండి మహా ప్రబో అంటూ... ప్రజలు, కాలనీవాసులు పలు కాలనీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే బ్రాహ్మణవాడ, కింది బజార్, నలంద నగర్, పలు కాలనీలో నీటి తిప్పలు తప్పడం లేదు. పట్టణంలో నీటి సమస్యతో పాటు మంచి నీటిలో మురుగు

నీరు కలుషితం అవుతుంది. మురికి నీటి కలుషితం కాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చెపట్టాలని కోరారు. ప్రజలు "నీళ్ల దాహం తీర్చండి మహాప్రభో" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రాహ్మణవాడ, కింది బజార్, నలంద నగర్ వంటి ప్రాంతాల్లోని పలు కాలనీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులు ఏలా స్పందిస్తారో అప్పటి వరకు వేచి చూడాల్సిందే..?

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

-ట్రాఫిక్ సిబ్బందికి అందించిన సేఫ్టీ కిట్లు, ట్రాఫిక్ పరికరాల పరిశీలిన -రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పటిష్టమైన ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్

- జాతీయ రహదారులపై ప్రమాదాల స్పాట్ లను గుర్తించాలి -జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

వార్షిక తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బందికి అందించిన సేఫ్టీ కిట్లు, ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించే పరికరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి, విధుల నిర్వహణకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. క్రమం తప్పకుండా వాహన తనిఖీలు చేపడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట డీఎస్పీ సత్యయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

పలు సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వినతి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, దాని ప్రభావంతో ప్రజలకు, రైతులకు కలిగే నష్టాలను ముందుగానే అరికట్టేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరారు. నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, తాగునీరు, సాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలపై ప్రజలను నేరుగా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి, వారి ఇబ్బందులను వివరించారు. సింగూర్ ప్రాజెక్టు నీటి నిర్వహణలో ముందస్తు ప్రణాళిక, దూరదృష్టి లోపించడం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో తీవ్రమైన తాగునీటి సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం ఉంటుందని తెలిసినప్పటికీ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని వినియోగించడంలో తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. బొబ్బిలిగామ, ఏటిగడ్డ సంఘం, మాలపాడు గ్రామాల మీదుగా వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమైయ్యాయని వెంటనే రోడ్డును బాగు చేయాలని కోరారు.

రాహుల్ సభకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే రాహుల్ గాంధీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలుదేరారు. ఐబీ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. సదాశివపేట మండలం నుంచి సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిద్దన్న, శ్రీనివాస్ యాదవ్‌లతో కలిపి మొత్తం 46 మంది బయలుదేరారు. కొండాపూర్ మండలం నుంచి ఆత్మ చైర్మన్ ప్రభు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డిలతో కలిపి 26 మంది ఢిల్లీ పయనమయ్యారు. నిర్మల జగ్గారెడ్డి, భరత్ సాయిరెడ్డిలతో సహా నియోజకవర్గం నుంచి మొత్తం 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నారు. బస్సుల ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.

యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి..! అదనపు కలెక్టర్ పాండు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియం లో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో సుమారు 400 మంది యువ కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానందుడు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తిని పెంపొందించేందుకు చేసిన బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వివేకానందుడు 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటులో అమెరికా సోదరీమణులారా, సోదరులారా అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. యువత తమలోని ప్రతిభను వెలికితీసి, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ యువత చదువుతో పాటు కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గేయం, వీధి నాటకం, తదితర కళాంశాల్లో పోటీలు నిర్వహించారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడ ప్రథమ స్థానం పొందిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అధికారులు తెలిపారు. జనవరిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి సంబంధిత అధికారులు, యువ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో అర్ధరాత్రి చోరీ కలకలం

ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాల అపహరణ

రూ.81 వేల నగదు సహా విలువైన సొత్తు చోరీ

రామాయంపేట, అక్టోబర్ 29. తెలంగాణ మంజీరా ప్రతినిధి:

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో అర్ధరాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించిన ఘటన కలకలం రేపింది. పట్టణం లోని మూడో వార్డు చిత్తారమ్మ దేవాలయం సమీపంలో నివాసముంటున్న రామారపు సత్యనారాయణ ఇంట్లో ఈ చోరీ జరిగింది.సత్యనారాయణ స్థానిక చిత్తారమ్మ దేవాలయంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా గత రాత్రి ఇంటికి తాళం వేసి వెళ్లగా, ఆయన భార్య లక్ష్మి గుండె ఆపరేషన్ నిమిత్తం డబ్బులు అవసర మవడంతో తన చెల్లెలి ఇంటికి వెళ్లినట్లు సమాచారం. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తాళాలను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించాడు. బీరువాలో ఉన్న నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించి పరారైనట్లు బాధితులు తెలిపారు.చోరీకి గురైన సొత్తులో రూ.81 వేల నగదుతో పాటు అర తులం బంగారు కమ్మలు, పది తులాల వెండి ఆభరణాలు ఉన్నట్లు బాధితులు వెల్లడించారు.గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న సత్యనారాయణకు తాళాలు ధ్వంసమై కనిపించడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న రెండో ఎస్ఐ నరేష్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుడిని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. పట్టణంలో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నిందితుడిని త్వరగా గుర్తించి చోరీకి గురైన సొత్తును రికవరీ చేయాలని బాధితులు కోరుతున్నారు.

30 తులాల బంగారం చోరీ కేసును ఛేదించిన పోలీసులు

అంతర్రాష్ట్ర ముఠా సభ్యురాలి అరెస్ట్.. 25 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

ఫేస్‌బుక్ మెసెంజర్‌లో చోరీకి స్కెచ్.. స్విఫ్ట్, ఇన్నోవా కార్లలో పరారీ

పోలీసు బృందానికి రివార్డులు ప్రకటించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్, అక్టోబర్ 29. తెలంగాణ మంజీరా ప్రతినిధి:

బస్సు ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని బంగారు ఆభరణాలను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును నిజాంపేట పోలీసులు రట్టు చేశారు. రాఖీ పండుగ సందర్భంగా బస్సులో చోరీకి గురైన 30 తులాల బంగారు ఆభరణాల కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు, ప్రధాన నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి సుమారు 25 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ వెల్లడించారు.

బస్సు ప్రయాణంలో చోరీ..

నల్గొండకు చెందిన సూరం స్నేహ ఆగస్టు 26న రాఖీ పండుగ సందర్భంగా తన వద్ద ఉన్న 30 తులాల బంగారు ఆభరణాలను బ్యాగులో పెట్టుకుని నిజాంపేటలోని తన తల్లిగారి ఇంటికి బయలుదేరారు. నిజాంపేటకు చేరుకున్న అనంతరం బ్యాగులోని బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించే దిశగా ముందుకు సాగారు.

ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా పథకం..

అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ మార్గదర్శకంలో, తూప్రాన్ డీఎస్పీ జె. నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో రామాయంపేట సీఐ బి. సైదా, నిజాంపేట ఎస్ఐ బి. రాజేష్‌లతో కూడిన ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ఈ క్రమంలో సరూర్‌నగర్‌కు చెందిన మేకల సంధ్య (30)ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

విచారణలో నిందితురాలు తన తల్లి సతుపాటి రాధిక, బంధువు అక్షింతల సంధ్య, బండి మోజెస్, బండి దుర్గలతో కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడినట్లు వెల్లడైందని తెలిపారు. చోరీ అనంతరం స్విఫ్ట్ కారు (టీఎస్ 08 జుఖీ 6174)లో హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడి నుంచి ఇన్నోవా క్రిస్టా (ఎం+ 07 + 1888)లో పరారైనట్లు వివరించారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ముఠా సభ్యులు ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా పరస్పరం సమాచారాన్ని పంచుకునేవారని పేర్కొన్నారు.

హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమండ్రి, నిజామాబాద్, మెదక్ ప్రాంతాల్లోని బస్టాండ్లలోనూ ఈ ముఠా చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలిపారు.

25 తులాల ఆభరణాలు స్వాధీనం..

అరెస్టయిన నిందితురాలి నుంచి నాలుగు బంగారు చైన్లు, నాలుగు లాకెట్లు, ఒక పుస్తెల తాడు, 13 ఉంగరాలు, ఒక ప్లాటినం ఉంగరం, నల్లపూసల దండలు, కంకణాలు, గాజులు, కమ్మలు, చంపస్వరాలు, ముక్కెర, సిక పువ్వు తదితర ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వీటి మొత్తం బరువు సుమారు 25 తులాలు ఉంటుందని తెలిపారు.

ఈ కేసులో పరారీలో ఉన్న ఇతర నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు మిగిలిన సొత్తును స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

బస్సులు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు బంగారు ఆభరణాలు, నగదు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, చోరీ జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు..

కేసును వేగంగా ఛేదించి నిందితురాలిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన రామాయంపేట సీఐ సైదా, ఎస్ఐలు రాజేష్, బాలరాజ్, హెడ్ కానిస్టేబుల్ సునీత, కానిస్టేబుళ్లు రాకేశ్, భాస్కర్, నాగభూషణ్, సాజిద్, లక్ష్మణ్, రాజు, కృష్ణ, శ్రీనివాస్ నాయక్‌లతో పాటు ఐటీ కోర్ సిబ్బంది విజయ్, వెంకట్, మహేందర్, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

కరువు మండలాల ప్రకటనలో మెదక్ జిల్లాకు అన్యాయం

జిల్లాలోని పలు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు డిమాండ్

రామాయంపేట, అక్టోబర్ 29. తెలంగాణ మంజీరా ప్రతినిధి:

కరువు మండలాల ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాకు అన్యాయం చేసిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు విమర్శించారు. జిల్లాలో కేవలం ఒకే మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న ఇతర మండలాలను కూడా వెంటనే కరువు మండలాలుగా గుర్తించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. మెదక్ జిల్లాలోని టేక్మాల్, చిలప్‌చెడ్, హత్నూర, శివ్వంపేట, రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, చేగుంట, మాసాయిపేట, తూప్రాన్ తదితర మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షాలు సరిగా కురవకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో వరి పొలాలు సైతం ఎండిపోతున్నాయని, సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు తాగునీటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయని రాగి రాములు అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ఒకే మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం ఎంతవరకు సమంజసమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కరువు మండలాల ఎంపికకు ప్రభుత్వం అనుసరించిన ప్రమాణాలు, పరిగణనలోకి తీసుకున్న గణాంకాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. వర్షపాతం, పంట నష్టం, సాగునీటి లభ్యత, తాగునీటి

దేశం కోసం యువత నడుం బిగించాలి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..

ఉన్నత విద్యపై దృష్టి సారించాలి ఎంపీ డీకే అరుణ పిలుపు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29. తెలంగాణ మంజీరా ప్రతినిధి:

దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశం కోసం యువత నడుం బిగించాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఉన్నత చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో అక్టోబర్ 29న మేరా యువ భారత్ మహబూబ్‌నగర్, ఉద్భవ్ సేవా సంసద్ ఆధ్వర్యంలో 'యువ సంసాద్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' నినాదంతో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఎస్ఐఆర్‌పై యువతకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, యువత విద్యకు ప్రాధాన్యతనిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వాటికి దూరంగా ఉంటూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఎస్ఐఆర్ అంశంపై మాట్లాడుతూ, ఈ ప్రక్రియ గురించి కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, దేశ భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని వివరించారు. ఎస్ఐఆర్ ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రయోజనాల కోసం కాదని, దేశ భద్రత దృష్ట్యా చేపట్టే ప్రక్రియగా ఆమె అభివర్ణించారు. ఈ అవగాహన సదస్సులో పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్ బాబు, డీన్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సెల్ అధికారి డాక్టర్ ప్రవీణ, జిల్లా యువజన అధికారి కోటా నాయక్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్, ఉద్భవ్ సేవా సంసద్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ అర్జున్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..